అమరన్ నటి ఇంట్లో సందడి

హీరో శివకార్తికేయన్ సోదరిగా నటించిన పెనుకొండ వాసి సుగమ్య శంకర్

సినిమా విజయంతో సంబరాలు



(వివరాలు 6లో...)

ఇంటి వద్దనే పింఛన్ అంటే కుదరదు..!

సచివాలయ ఉద్యోగి మండిపాటు.. ఆడియో వైరల్



రామలక్ష్మి

బత్తలపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దే ప్రభుత్వం అందజేస్తోంది. ఆ మేరకు ఒకటో తేదీనే పంపిణీ పూర్తిచేసేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. బత్తలపల్లి సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ రెడ్డి మాత్రం ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇవ్వాలంటే కుదరదని తేల్చిచెప్పాడు. సచివాలయం వద్దకే రావాలని హుకుం జారీ చేశాడు. చేసేదిలేక 85 ఏళ్ల వృద్ధురాలు ఆటోలో సచివాలయానికి వచ్చి, పింఛన్ సొమ్ము తీసుకుంది. లబ్ధిదారురాలిపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మండిపడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బత్తలపల్లిలోని విజయ్‌చౌదరి కాలనీలో 85 ఏళ్ల వృద్ధురాలు రామలక్ష్మి నివాసముంటోంది. ఈమెకు పింఛన్ వస్తోంది. ఒకటో తేదీన ఆమెకు పింఛన్ ఇచ్చేందుకు ఎవరూ రాలేదు. దీంతో ఆమె కుటుంబీకుడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి, పింఛన్ ఇవ్వలేదని తెలిపాడు. దీంతో సచివాలయ ఉద్యోగి.. 'అందరికీ ఇళ్లవద్దకే వచ్చి పింఛన్ ఇవ్వాలంటే ఎలాగనీ, సచివాలయం వద్దకే వచ్చి తీసుకోండ'ని చెప్పాడు. వృద్ధురాలు అని చెప్పినా.. వినలేదు. బైక్‌లో వచ్చి తీసుకెళితే తాను వస్తానంటూ వృద్ధురాలి కుటుంబీకుడిపై చిందులు తొక్కాడు. చేసేది లేక రామలక్ష్మి ఆటోకు రూ.400 బాడుగ చెల్లించి, సచివాలయం వద్దకెళ్లి రెండోతేదీ సాయంత్రం తీసుకుంది. పింఛన్ పంపిణీలో సచివాలయ ఉద్యోగిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్టీఆర్‌తోనే బడుగులకు రాజ్యాధికారం

మండల, పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తాం: మంత్రి సవిత



రొద్దంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుతోనే బడుగులకు రాజ్యాధికారం దక్కిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు మంత్రి సవిత, కూటమి నాయకులు ఆదివారం భూమిపూజ చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. బడుగుల సంక్షేమానికి ఎన్టీఆర్ ఎంతో కృషిచేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు బడుగులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ విగ్రహాలను నియోజకవర్గ వ్యాప్తంగా మండల, పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

బోధన.. వేదన..!

అధ్యాపకులే లేని తాడిమర్రి జూనియర్ కాలేజీ



ఒక్కరినీ కేటాయించని ప్రభుత్వం

అతిథి, కాంట్రాక్టు సిబ్బందే దిక్కు

కుంటుపడుతున్న బోధన

వివరాలు 7లో..

దళిత కుటుంబంపై దౌర్జన్యకాండ

- రెచ్చిపోయిన వైసీపీ మూకలు
- దళితుడిపై దాడి..
- పోలీసులకు ఫిర్యాదు చేయకుండా హెచ్చరికలు
- చంపేస్తామంటూ బెదిరింపులు
- భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



గౌతమ్



తీవ్ర కాలిన గాయాలతో గౌతమ్

బుక్కపట్నం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. దళిత కుటుంబంపై దౌర్జన్యకాండ సాగించారు. దళితుడిపై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంట్లోని అందరినీ చంపేస్తామని దళితుడి కుమారుడిని బెదిరించారు. వాటిని భరించలేక ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్నాడు. మండలంలోని మారాల గ్రామంలో టీడీపీ కార్యకర్త దళిత నారాయణస్వామి కుటుంబంపై అదే ఊరికి చెందిన వైసీపీ మూకలు దాష్టీకం ప్రదర్శించాయి. నారాయణస్వామి కూలి పనులకెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. రెండు నెలల క్రితం గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా నారాయణస్వామిపై అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రామమోహన్ విచక్షణారహితంగా దాడి చేశాడు. దీనిపై బుక్కపట్నం పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణమూర్తిని నారాయణస్వామి ఈనెల 2న కలిశాడు. నారాయణస్వామి కోసం అతడి కుమారుడు గౌతమ్ స్టేషన్‌కు వస్తుండగా.. మార్గమధ్యలో మండలంలోని బుచ్చయ్యగారిపల్లి వద్ద వైసీపీ నాయకులు రామమోహన్, ప్రసాద్, ఓబుళప్ప, గోపి, సన్నరాముడు కారుతో అడ్డగించారు. తీవ్రస్థాయిలో బెదిరించారు. 'నీ తండ్రి.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలనీ, లేదంటే కుటుంబం మొత్తాన్ని హతమారుస్తామం'టూ హెచ్చరించారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన గౌతమ్ పుట్టపర్తిలోని తమ తాత్కాలిక నివాసంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పుపెట్టుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. గౌతమ్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి హామీలో అక్రమాలు

నారాయణస్వామిపై పీర్లపండుగ సందర్భంగా దాడి చేసిన వైసీపీ నాయకుడు రామమోహన్ గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. అప్పటి ప్రజాప్రతినిధి అండతో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అక్రమాలపై నిలదీస్తే గ్రామస్థులపై దురుసుగా వ్యవహరించడం పరిపాటేనని స్థానికంగా పేర్కొంటున్నారు.

దాడులు చేస్తే.. చూస్తూ ఊరుకోం..: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

నియోజకవర్గంలో దాడులను ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ శ్రేణులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్పీ రత్నను కోరారు. వైసీపీ నాయకుల బెదిరింపులో ఆత్మహత్యకు యత్నించిన గౌతమ్, అతడి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. ఆదివారం ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు.

కొరవడిన సమన్వయం..!

కూటమికి జనసేన, బీజేపీ దూరం.. దూరం..

- పిలవలేదంటూ మొహం చాటేస్తున్న వైనం
- నేడు ఎన్డీఏ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం
- హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి అనగాని



పుట్టపర్తి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటింది. జిల్లాలో హిందూపురం పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే గెలిచారు. దీంతో తమకు ప్రాధాన్యతతోపాటు అధికారంలో భాగస్వామ్యం ఉంటుందని కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భావించాయి. ఆ దిశగానే టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు బీజేపీ అధినాయకత్వం నుంచి ఎన్డీఏ కూటమి ఒప్పందాలు, సమన్వయంతో గ్రామస్థాయిదాకా కొనసాగించాలని ప్రతిసారీ చెబుతున్నారు. తొలి జాబితాలో నామినేటెడ్ పదవుల్లో సైతం కూటమి ధర్మాన్ని పాటించి, ఎంపిక చేశారు. ఎమ్మెల్యేలు, కూటమి నేతలే నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధినాయకత్వం సూచిస్తోంది. కూటమి నేతల మధ్య అభిప్రాయభేదాలు వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా.. జిల్లా విషయానికొచ్చేసరికి కూటమి ఒప్పందాలు, ఆశయాల సాకారం దిశగా నడవలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలిగా ప్రభుత్వ కార్యక్రమాల్లో కూటమిలో టీడీపీ శ్రేణులు హవా సాగిస్తున్నారనీ, తమకు ప్రాధాన్యం ఇవ్వట్లేదనీ, మాట వరుసకు కూడా పిలవడంలేదంటూ జనసేన, బీజేపీ నేతలతోపాటు ఆ పార్టీల శ్రేణులు దూరం జరుగుతున్నాయి. చాలాచోట్ల ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు అభివృద్ధి పనుల్లో తమ భాగస్వామ్యం లేదంటూ కినుక చెందుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వలేదంటూ ఇటీవల జనసేన, బీజేపీ అధినాయకత్వానికి జిల్లా నుంచి ఫిర్యాదులు సైతం చేశారు. మొదట్లో ఇచ్చిన ప్రాధాన్యం ఇప్పుడు లేదనీ, ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

సమన్వయంతో సాగితేనే..

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం తొలిసారిగా జిల్లాలో పర్యటిస్తున్నారు. పుట్టపర్తిలోని సాయిఆరామంలో జిల్లాకి చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎన్డీఏ నేతలతో నిర్వహించే జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొంటారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించే విషయంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు కూటమి పార్టీ నేతల భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఆయా నియోజక వర్గాల అభివృద్ధిలో కూటమి నేతల సమన్వయంపై చర్చించి, దిశానిర్దేశం చేయనున్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసికట్టుగా పనిచేస్తామని పైకి చెబుతున్నా మంత్రులలు, కొందరు ఎమ్మెల్యేల మధ్య సఖ్యతలేదనీ, ఈ అశంపై సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య పెరుగుతున్న దూరాన్ని సమన్వయంతో తగ్గిస్తారో.. అలాగే వదిలేస్తారో సోమవారం సమావేశంలో తేలనుంది.

పెరుగుతున్న దూరం

జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉన్నా.. సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా బరిలోకి దిగడంతో జనసేన, బీజేపీ శ్రేణులు కలిసి పనిచేశాయి. అధికారంలోకి వచ్చిన మూడునెలలదాకా కూటమిలో ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, క్యాడర్ సమన్వయంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టారు. ఆ తర్వాత నియోజకవర్గాల్లో ఒప్పందాలు, నియామకాలు, అభివృద్ధి నిధుల పంపకాలు, బదిలీలు ఎమ్మెల్యేలు చెప్పినట్లుగానే సాగాయనీ, తమ మాటకు విలువివ్వలేదని జనసేన, బీజేపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. తాజాగా ప్రైవేటు మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తే ఇందులో జిల్లావ్యాప్తంగా టీడీపీ వర్గీయులకే ప్రాధాన్యత ఇచ్చారనీ, తమతో మాట వరుసకు కూడా చర్చించలేదని పలు నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు కినుక వహిస్తున్నారు. కూటమిలో తమకే ప్రాధాన్యం లేకుంటే వెంట నడిచే శ్రేణులకు ఏ న్యాయం చేయగలమని జనసేన, బీజేపీ నేతలు సన్నిహితుల వద్ద ఆవేదన చెందుతున్నట్లు ఆ పార్టీల్లో చర్చ సాగుతోంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నియామకాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ శ్రేణులు పెద్ద యుద్ధమే చేసిన సంగతి తెలిసిందే. కమిషనర్‌ను బదిలీ చేసేదాకా టీడీపీ శ్రేణులు పట్టువిడవకుండా రోడ్డెక్కి రచ్చ చేసేదాకా వచ్చింది. హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీల్లో కొందరు నేతలు మాత్రం అప్పుడప్పుడు ప్రభుత్వ కార్యక్రమాల్లో కన్పించినట్లే కన్పించి ముఖం చాటేస్తున్నారు. ఇలా మండల, గ్రామీణస్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో సమన్వయం కొరవడి ఎవరికి వారుగా దూరం పెరిగే విధంగా తయారైంది. జనసేన, బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యత తగ్గించలేదని టీడీపీ ఎమ్మెల్యేలు, శ్రేణులు చెబుతున్నా.. కూటమిలో లుకలుకలు మొదలైనట్లు చర్చ సాగుతోంది.

నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం



మంత్రి అనగాని సత్యప్రసాద్

పుట్టపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత, ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గత నాలుగు నెలల్లో చేసిన అభివృద్ధి, హామీల అమలుపై చర్చించనున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మరో ఎనిమిది మందిపై వేటుకు రంగం సిద్ధం



కానిస్టేబుళ్లు నరేష్, వెంకటరామిరెడ్డి



హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సామూహిక అత్యాచారం కేసు విచారణలో నిందితులు వెల్లడించిన వివరాలతో హిందూపురంలో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీచేశారు. ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్‌తో కలుపుకుని మరో ఎనిమిది మందిపై వేటుకు రంగం సిద్ధమైంది. గతనెలలో చిలమత్తూరు మండలంలో జరిగిన సామూహిక అత్యాచారం రాష్ట్రంలో కలకలం రేపింది. ఈ అత్యాచారం కేసులో పాత నేరస్తులైన హిందూపురానికి చెందిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా పోలీసులపైనే వారు కొన్ని దిమ్మతిరిగే వాస్తవాలు ఉన్నతాధికారులకు వివరించారు. గతంలో పాత నేరస్తులకు పోలీసులు సహకరించిన తీరు బయట పెట్టారు. పూర్తి ఆధారాలు సేకరించి దీనిపై జిల్లా ఎస్పీ లోతుగా విచారించారు. ఈ నేపథ్యంలో హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు నరేష్, వెంకటరామిరెడ్డిలను సస్పెండ్ చేస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పాత నేరస్తులు ఇచ్చిన సమాచారంతో వివిధ మార్గాల్లో విచారణ చేశారు. ఇందులో ఓ ఏఎస్ఐతోపాటు పట్టణంలోని రెండు స్టేషన్‌లో పనిచేస్తున్న మరో ఏడు మంది హెడ్‌కానిస్టేబుళ్లపై కూడా వేటుపడనుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇద్దరు సస్పెండ్ అయిన కానిస్టేబుళ్లకంటే మరో ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్లు పాత నేరస్థులతో చేతులు కలపడంతోపాటు ఓ కేసులో పట్టుబడినప్పుడు స్టేషన్‌కు తీసుకొస్తూ వదిలేశారు. దీనిపై కూడా లోతుగా విచారణ చేపట్టారు. వారిపై కూడా ఒకటి రెండు రోజుల్లో వేటుపడనుంది. అయితే వారిని కూడా సస్పెండ్ చేస్తారా లేక చార్జ్ మెమో ఇచ్చి బదిలీ చేసి చేతులు దులుపుకుంటారా వేచి చూడాలి. అయితే వీరిలో కొంత మందిని పోలీస్ అధికారులు, మరికొంతమందిని రాజకీయ నాయకులు వెనకేసుకువస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే 'ఆంధ్రజ్యోతి'లో శనివారం రోజే ఖాకీ వెన్నులో వణుకు అనే కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే.

భూకబ్జా కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు



నిందితుడు షామీర్‌బాషా

- బోగస్ పట్టాలు, పాసుపుస్తకాల స్వాధీనం
- పరారీలో వైసీపీ నాయకులు, రెవెన్యూ ఉద్యోగి

కదిరి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అనుచరుడు, వైసీపీ నాయకుడు స్థానిక నిజాంవలీ కాలనీకి చెందిన షామీర్‌బాషాను భూఆక్రమణ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 1777-2లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు షామీర్‌బాషా యత్నించాడని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గతనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. అప్పట్నుంచి షామీర్ బాషా పరారీలో ఉన్నాడు. నిజాంవలీకాలనీలో అతడి ఇంటివద్ద షామీర్ బాషాను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అతడి వద్దనుంచి 301 బోగస్ ఇళ్ల పట్టాలు, మరో 168 జిరాక్స్ పట్టాలు, వివిధ మండలాలకు చెందిన 32 పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అత్తార్ చాంద్‌బాషా ఎమ్మెల్యేగా ఉన్నపుడు నాగిరెడ్డిపల్లి రైల్వే ట్రాక్ పక్క సర్వే నంబరు 1022, 931-1ల్లో నిరుపేదలకు కొన్ని పట్టాలిచ్చి, మిగిలినవి తనకిచ్చారని షామీర్ బాషా విచారణలో ఒప్పుకున్నట్లు చెప్పారు. వాటిని దాదాపు 120మందికి రూ.30 వేల నుంచి రూ.50 వేలు చొప్పున విక్రయించినట్లు తెలిపాడన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఆర్ఐ మున్వర్, పట్టణానికే చెందిన పరికి షామీర్, కొలిమి హర్షద్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు.

హెచ్చెల్సీ





జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. వైసీపీ పాలనలో జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు నిధులు లేక నీరసించిపోయాయి. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ పూర్తికి అవసరమైన భూసేకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో పాటు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పట్ల గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బీటీపీ, పేరూరు ప్రాజెక్టల పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని జిల్లా ప్రజలు, రైతులు ఆశాభావంతో ఉన్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్, ఆంధ్రజ్యోతి



హంద్రీనీవా కాలువ

నిరీక్షణ

నిధుల కోసం నీటి ప్రాజెక్టుల ఎదురుచూపు

వైసీపీ పాలనలో అన్ని ప్రాజెక్టులు నిర్వీర్యం

ముందుకు సాగని హెచ్చెల్సీ ఆధునికీకరణ

హంద్రీనీవా కాలువ వెడల్పు కథ అంతేనా..?

అగమ్యగోచరంగా బీటీపీ, పేరూరు పరిస్థితి..!

కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా?

ప్రతిపాదనలు పంపిన జలవనరుల శాఖ అధికారులు

ప్రతిపాదనలకు స్పందన ఏదీ?

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం(హెచ్ఎన్ఎస్ఎస్) కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు సుమారు మూడు దఫాలుగా ప్రభుత్వానికి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపినా ఎలాంటి స్పందన లేదు. ఉరవకొండ ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం 38వేల ఎకరాలకు సంబంధించి పనులు ప్రారంభించినా, వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. గుంతకల్లు, గుత్తి పరిధిలోని 12మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు రూ.20కోట్లతో చేసిన ప్రతిపాదలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.

సీఎల్‌డీఐని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకువచ్చింది. ఉరవకొండ ప్రాంతంలోని బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.840కోట్లతో 2017లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ సీఎల్‌డీఐ పథకాన్ని రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన పరికరాలు మూలనపడేశారు. ప్రస్తుతం ఉరవకొండ నుంచి గెలిచి కూటమి ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా కీలక స్థానంలో పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తుండటంతో నియోజకవర్గానికి దశ మారుతుందని అధికారులు చెబుతున్నారు.



బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

గత టీడీపీ ప్రభుత్వం కరువు జిల్లాను సస్యశ్యామలం చేయాలని బీటీపీ, పేరూరు ప్రాజెక్టులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం రూ.541కోట్లు నిధులు కేటాయించింది. అయితే చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం రూ.20కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టును రూ.591 కోట్లతో చేపట్టారు. 53 కిలోమీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.164కోట్లు పనులు చేయగా రూ.100కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆగిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. 2008-09లో రూ.458కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ ప్రారంభించారు. 2018వరకు రూ.310కోట్ల పనులు జరిగాయి. ఇక మిగిలిన రూ.148కోట్ల పనులను రద్దు చేస్తూ 2019లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులను అలాగే కొనసాగించి ఉంటే ఇప్పటికి పూర్తి అయ్యేవి. ప్రస్తుత ధరల ప్రకారం రూ.148కోట్ల పెండింగ్ పనుల విలువ రూ.500కోట్లకు చేరిందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పూర్తి చేస్తే 2600క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువను 4200క్యూసెక్కులకు పెంచుకునే అవకాశం ఉంటుంది. దీంతో టీబీ డ్యాం నుంచి అదనంగా వరద జలాలను జిల్లాకు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది.

పీఏబీఆర్‌కు భూసేకరణే సమస్య

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయర్ పెన్నా అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్). దీని నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలు. ఇప్పటి వరకు ఎప్పుడూ 11టీఎంసీలు నిల్వ ఉంచలేదు. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టి, నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. పీఏబీఆర్ సామర్థ్యం అంచనా వేసేందుకు టెస్టుల చేయడానికి పూణేకు చెందిన సీడబ్ల్యూసీ కంపెనీ రూ.5కోట్లు అడిగింది. వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 11టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450కోట్లు నిధులు అవసరం ఉంది. ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్‌కు అవసరమైన రూ.4.8కోట్ల విడుదలను కూడా వైసీపీ ప్రభుత్వం విస్మరించింది.

ప్రతిపాదనలు పంపాం



జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాధాన్యతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఇంజనీర్ల అభిప్రాయా లను తీసుకున్నారు. హంద్రీనీవా కాలవ కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.1200కోట్లు ప్రతిపాదనలు పంపాం. మడకశిర బైపాస్ కెనాల్, గుంతకల్లు, పుట్టపర్తి మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీళ్లు నింపే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. ఉరవకొండ ప్రాంతంలో సా మూహిక బిందు సేద్యం పథకాన్ని పునరుద్ధరిస్తే అద్భుతమైన ఫలితాలు వ స్తాయి. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి, డిస్ట్రిబ్యూటరీలను ని ర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది.

- నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టల సీఈ



తట్టఇడ్లీని బాక్స్‌లోకి వేస్తున్న నిర్వాహకుడు

'తట్ట' రుచే వేరు..!

ఆహారప్రియులను ఆకర్షిస్తున్న తట్ట ఇడ్లీ



కారంనెయ్యి కలిపిన తట్టఇడ్లీ

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఫుడ్ లవర్స్‌ను వివిధ రకాల వెరైటీలతో ఆకర్షిస్తుంటారు. రుచి, శుచితో పాటు ఇదీ మా 'ప్రత్యేకత' అని చెబుతుంటారు. ఈ కోవకు చెందినదే తట్ట ఇడ్లీ. సాధారణంగా మనకు తెలిసిన ఇడ్లీ అరచేతిలో పట్టేదిగా కాస్త అటూ ఇటుగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం భారీ సైజులో ఉంటుంది. సైజులోనే కాదు రుచిలో కూడా అద్భుతం అనేలా ఉంటుంది ఈ తట్ట ఇడ్లీ. ఇలాంటి భారీ ఇడ్లీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది నగరంలోని జేఎన్‌టీయూ కళాశాల ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న బెంగళూరు తట్ట ఇడ్లీ (బీటీఐ) హోటల్. ఇక్కడ భారీ ఇడ్లీకి కాంబినేషన్‌గా పప్పులచెట్నీ, అల్లంచెట్నీ, సాంబారు ఇస్తారు. అలాగే ఇడ్లీపైన మసాలాకారం, దానిపై నెయ్యివేసిమరో వెరైటీలో ఇడ్లీ ఇస్తున్నారు. ఇక్కడ ఉదయం రెండు ఇడ్లీలు తింటే మధ్యాహ్నం వరకు ఆకలి కాదని తిన్నవారు చెబుతుంటారు.

జీతాల కోతపై ఆగ్రహం

డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట వైద్య ఉద్యోగుల ఆందోళన



నిరసన తెలుపుతున్న వైద్యశాఖ ఉద్యోగులు, ఎన్జీఓ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధులలో ముఖహాజరు వేయలేదని జీతాలలో కోత పెట్టడంపై వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 91మంది వైద్యసిబ్బందికి ఈనెల జీతాలలో భారీగా కోతపెట్టారు. దీంతో ఆదివారం ఎన్జీఓ నాయకుల మద్దతుతో వైద్యశాఖలోని ఎన్‌హెచ్ఎం వైద్యసిబ్బంది డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిం చారు. ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఎన్‌హెచ్ఎం వైద్యఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల వేతనాలకు ముఖ హాజరు(ఎఫ్ఆర్ఎస్) లింకు పెట్టడం అన్యాయమన్నారు. ఆన్‌లైన్ ముఖహాజరులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సర్వర్ సమస్యవల్ల చాలామంది విధులకు వెళ్లినా సకాలంలో హాజరు పడటం లేదన్నారు. ఇంకొంతమంది మహిళా వైద్యఉద్యోగులకు అదనంగా ఉన్న స్పెషల్ క్యాజువల్ లీవ్స్ చూపకపోవడం వల్లకూడా గైర్హాజరు కింద చూపిస్తోందన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేసే వైద్య ఉద్యోగులకు ముఖహాజరు మినహాయించాలని ముందునుంచి కోరుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం వేతనాల కోత నిర్ణయాన్ని విరమించుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోలనలు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లావైద్యశాఖ ఏఓ గిరిజామనోహరను కలిసి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు శ్రీనివాస్‌కుమార్, జమీలాబేగం, శ్రీధర్‌బాబు పలువురు వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

మా అమ్మ.. మాకొద్దు..!

తిరుపతమ్మను తీసుకెళ్లేందుకు నిరాకరించిన బిడ్డలు

పోలీస్‌స్టేషన్‌లో విచారించిన సీఐ జయన్న



వృద్ధురాలు తిరుపతమ్మ కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయన్న

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'నడి రోడ్డుపై అమ్మ' కథనం రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన కలిగించినా ఆమె కొడుకు, కుమార్తెల్లో ఇసుమంతైనా దయ కలగలేదు. తల్లిని తమతో తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ కొడుకు, కుమార్తెలు పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. కన్నతల్లిని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన వృద్ధురాలు తిరుపతమ్మ కొడుకుతోపాటు కూతుళ్లకు పత్తికొండ సీఐ జయన్న ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంతకల్లులో ఉన్న కొడుకు శ్రీనివాసులు, ఆయన భార్యతో పాటు బళ్లారిలో ఉంటున్న కుమార్తె, అల్లుడు, పత్తికొండలో ఉంటున్న మరో కుమార్తె, అల్లుడు ఆదివారం రాత్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆసుపత్రిలో దయనీయ స్థితిలో ఉన్న తల్లిని తీసుకెళ్లాలని సీఐ వారికి సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తాము తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ వారు స్పష్టం చేశారు. సీఐ ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. అయినప్పటికీ వారికి సోమవారం గడువు ఇస్తున్నామని, లేదంటే చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

ఫ్యాక్టరీదే నిర్లక్ష్యం

నిబంధనలు పాటించలేదని ప్రాథమిక నిర్ధారణ

సప్తగిరి కర్పూరం కర్మాగారానికి షోకాజ్ నోటీసు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం లోలూరు వద్ద సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమలో జరిగిన ఘటనపై విచారణ కమిటీ ఆదివారం రాత్రి ప్రాథమిక నివేదికను కలెక్టర్ వినోద్ కుమార్‌కు అందజేసింది. శుభ్రం చేసేటపుడు, వెల్డింగ్‌చేసే సమయంలో, కార్మికులు రియాక్టర్‌లోకి దిగేటపుడు పరిశ్రమ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విచారణ కమిటీ అధికారులు తేల్చారు.కనీసం ఆక్సిజన్ అందించే పరికరాలు కూడా కార్మికులకు అందించలేదని పేర్కొన్నారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఫ్యాక్టరీల చట్టం ప్రకారం తొలుత సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పరిశ్రమ సమాధానం ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

డాడీ ఎక్కడా అంటే

ఏమని చెప్పను..!

వాడి అల్లరి భరించలేను.. లెయ్ మహేష్..

భర్త మృతదేహంపైపడి విలపించిన భార్య



భర్త మృతదేహంపై పడి విలపిస్తున్న భార్య

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'డాడీ ఎక్కడికి వెళ్లాడని అడిగితే ఏమని చెప్పను.. వాడి అల్లరి భరించడం నావల్ల కాదు.. లెయ్ మహేష్..' అంటూ మృతుడిపై పడి భార్య ప్రవళిక బోరున విలపించిన సంఘటన అందరినీ కలిచివేసింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బండపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు వంగవేడు వంకలోపడి మహేష్(36) మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేష్ హిందూపురంలో నివాసముంటున్న అత్త కూతురు ప్రవళికను ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో బెంగళూరులో నివాసముంటున్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని బండపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో మహేష్, భార్య ప్రవళిక, తమ్ముడు రాజేష్, అతడి భార్య శిరీష కలిసి గ్రామ సమీపంలోని వంగవేడు వంకలో ఈత కొట్టడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు మహేష్ వంక ఉధృతికి కొట్టుకుపోయి ఇరుక్కుపోయాడు. రక్షించేందుకు తమ్ముడు, భార్య ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమీపంలో ఉన్న స్థానికులు వచ్చి బయటకు తీశారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ప్రవళిక, కుమారుడు అగస్త్య ఉన్నారు. చిన్న వయసులోనే మహేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లింది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు మృతి

నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్

తూర్పుగోదావరి జిల్లాలో ఘటన

మృతులు అనంతపురం వాసులు



లారీని ఢీకొన్న కారు

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో వృద్ధులైన అక్కా చెల్లెళ్లు మృతి చెందారు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంలోని శారదానగర్‌కు చెందిన కనకదుర్గ (84) శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. వీరిద్దరికీ వివాహం కాలేదు. వీరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. వాటిని అద్దెకు ఇచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వెళ్లి అద్దె వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సాకే సూర్యనారాయణ (45)తో కలిసి కారులో ఈ నెల 2న సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు బయల్దేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. నిద్రమత్తులో దానిని గమనించని కారు డ్రైవర్ వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి, సూర్యనారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్ది సేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.



ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ (ఫైల్ ఫొటోలు)

స్థలం విషయంలో ఘర్షణ

టీడీపీ కార్యకర్తలకు గాయాలు



గాయపడిన కరే వెంకటేష్

రాప్తాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగినేపల్లి గ్రామంలో ఇంటి దగ్గర స్థలం విషయంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు.... భోగినేపల్లిలో కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతుల ఇంటి వద్ద స్థలం విషయమై గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఘర్షణ జరిగింది. అప్పుడు కూడా వైసీపీ కార్యకర్తలు కరే వెంకటేష్, నారాయణమ్మ దంపతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తాజాగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో మరోసారి స్థలం విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైసీపీ కార్యకర్తలైన కోలాల ప్రవీణ్, కోలాల ఉజ్జినప్ప, నాగమ్మ, కోలాల లక్ష్మీనారాయణమ్మలు టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్, నారాయణమ్మ దంపతులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

'సత్యంలోనే పరమాత్ముడి స్వరూపం'



అనుగ్రహభాషణం చేస్తున్న మల్లాది వేంకట రామనాథ శర్మ

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యంలోనే భగవంతు డి స్వరూపం ఉందని బ్రహ్మశ్రీ మల్లాది వేంకట రామనాథ శర్మ పే ర్కొన్నారు. భారతీతీర్థ స్వామి సన్యాసాశ్రమ స్వీకార స్వర్ణోత్సవాలను పుర స్కరించుకుని శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం సా యంత్రం శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది వేంకట రామనాథశర్మ అనుగ్రహ భాషణం చేస్తూ... పరబ్రహ్మ లేకపోతే సృష్టే లేదన్నారు. శ్రీకృష్ణుడు తాను చేయాల్సిన కార్యాలన్నింటిని చేసిన తర్వాత దశావతారాలను చూపించారన్నారు. ప్రతిఒక్కరూ ఎల్లప్పుడూ భాగవత పఠనం చేసి సారాన్ని ఆస్వాదించాలని, అప్పుడు భగవంతుడి సాక్షాత్కారం జరిగినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకుడు సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఏలూరులో ఆదివారం ఏపీ చెస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ర్యాంకింగ్ చెస్ టోర్న మెంట్-2024 పోటీలకు జిల్లా నుంచి పలవురు క్రీడాకారులు ప్రాతిని ధ్యం వహించారు. అండర్-8 బాలికల క్యాటగిరీలో మనస్వి మల్కా నాలుగో స్థానం, అండర్-10లో అవుటి సుకృత నాలుగో స్థానం, శారోన్ బ్లెస్సీ ఐదో స్థానం సాధించారు. అండర్-10 బాలుర క్యాటగిరీలో సాయి యశస్ మొదటి స్థానం, అండర్-14లో సాయి మనోజ్ కృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



నటి సుగమ్య శంకర్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

అమరన్ నటి ఇంట్లో సందడి

హీరో శివకార్తికేయన్ సోదరిగా నటించిన

పెనుకొండ వాసి సుగమ్య శంకర్

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్ధమాన నటి సుగమ్య శంకర్ ఇంట్లో ఆదివారం సందడి నెలకొంది. 2014లో కశ్మీర్‌లో వీరమరణం పొంది భారతదేశ అత్యున్నత పురస్కారమైన అశోకచక్ర బిరుదుతో గౌరవించిన గొప్ప సైనికుడు, తమిళనాడుకు చెందిన మేజర్ ముకుంద వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కించిన సినిమా అమరన్. ఈ చిత్రంలో మేజర్ ముకుంద వరదరాజన్ పాత్రలో నటించిన శివకార్తికేయన్ సోదరి నిత్య వరదరాజన్‌గా పెనుకొండకు చెందిన సుగమ్య శంకర్ నటించారు. ఈ చిత్రం విజయవంతం కావడంతో కుటుంబ సభ్యులు నటి సుగమ్యకు స్వీట్లుపెట్టి సంతోషం వ్యక్తం చేశారు. పెనుకొండ వాసులతో కలిసి స్థానిక థియేటర్‌లో ఆమె సినిమా చూశారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ చైల్డ్ ఆర్టిస్ట్‌గా నాగభరణి, మర సినిమాల్లో నటించినట్లు తెలిపారు. వీరమరణం పొందిన మేజర్ సోదరిగా నటించడం గర్వంగా ఉందన్నారు. దేశానికి సంబంధించిన ఆర్మీ వారి జీవిత చరిత్ర సినిమాలో అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మరో మూడు సినిమాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి రవిశంకర్‌గురుాజీ, తల్లి గాయత్రి, అన్న సునాగ్ శంకర్ భరద్వాజ్ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బోధన.. వేదన..!


ప్రభుత్వ జూనియర్ కళాశాల



ఒక్కరినీ కేటాయించని ప్రభుత్వం
అతిథి, కాంట్రాక్టు సిబ్బందే దిక్కు
కుంటుపడుతున్న బోధన

అధ్యాపకులేలేని తాడిమర్రి జూనియర్ కాలేజీ

తాడిమర్రి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన కుంటుపడుతోంది. కాలేజీ కట్టారు తప్ప.. సిబ్బందిని నియమించ లేదు. కాలేజీ మొత్తానికి ఒక్కటంటే ఒక్క అధ్యాపకుడి పోస్టును కూడా కేటాయించలేదు. దీంతో అతిథి, కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. వారు కూడా అరకొరగా ఉండడంతో బోధన కుంటుపడుతోంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా అధ్యాపకులను నియమించి, బోధన సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి, తాడిమర్రి


సైన్స్‌ల్యాబ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

మండలంలో 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. తరువాత సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని మేడిమాకులపల్లికి చెందిన ఎర్రగంగు వెంకటేశ్ ఐదెకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆ స్థలంలో కళాశాల భవనాన్ని నిర్మించి, 2016లో అందుబాటులోకి తెచ్చారు. భవనం కట్టారు కానీ, అధ్యాపక పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు. కళాశాలలో 147 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 11 మంది అధ్యాపకులను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. మరో ముగ్గురిని అదనపు విధుల కోసం కేటాయించాలి. ప్రస్తుతం ప్రిన్సిపాల్, అటెండర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. మిగిలిన వారందరూ అతిథి, కాంట్రాక్టు అధ్యాపకులే. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. పలుమార్లు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కళాశాల భవనంలో సైన్స్‌ల్యాబ్, తరగతి గదులు, డైనింగ్‌హాల్‌తోపాటు పచ్చని మైదానం ఉన్నా.. అధ్యాపకుల్లేరని వారు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం



కళాశాలలో అధ్యాపకుల కొరత వాస్తవమే. అధ్యాపక పోస్టులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. అధ్యాపకులు వస్తే.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

- సురేశ్‌బాబు, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల

విభజనపై విద్యుత్ ఉద్యోగుల అసంతృప్తి

ఆందోళనలకు సిద్ధమవుతున్న జేఏసీ
నేడు ఉన్నతాధికారులకు వినతులు


ఉమ్మడి జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయం

అనంతపురంరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల విభజనపై ఆ శాఖలో అసంతృప్తి రగులుతోంది. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకుల అభిప్రాయాలను కూడా తీసుకోకుండా విభజించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జేఏసీ నాయకులు ఆ శాఖ ఉన్నతాధికారులను కలవనున్నారు. ఇటీవల ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని సర్కిళ్లను విభజించి ప్రభుత్వం కొత్త విద్యుత్ సర్కిళ్లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా సర్కిళ్లుగా విభజించి అధికారులు, సిబ్బందిని కేటాయించింది. నిబంధనలకు విరుద్ధంగా విభజన ప్రక్రియ చేశారని.. సీనియార్టీ, పిల్లల విద్యాసంవత్సరం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సర్కిల్లో కనీస ఏర్పాట్లు చేయకుండా ఉద్యోగుల కేటాయింపు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా జేఏసీ నాయకులు ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం అనంతపురం జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈని కలసి వినతులు అందజేయనున్నట్లు జేఏసీ నాయకులు చెబుతున్నారు. స్పందన లేకపోతే ప్రత్యక్ష, పరోక్ష ఆందోళనలకు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

డిప్లొమా ఇంజనీర్ల సంఘం కార్యవర్గాల ఎన్నిక

అనంతపురం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలోని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పనిచేస్తున్న ఏపీ పీఆర్ డిప్లొమ ఇంజనీర్స్ ఆయా జిల్లాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, రఘురాంరెడ్డి, ఎలక్షన్ ఆఫీసర్లు సంతోష్‌గౌడ్, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ సజావుగా నిర్వహించారు. అనంతపురం జిల్లా నూతన అధ్యక్షుడిగా మాధవ్‌కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జీఆర్‌వీ కిషోర్‌కుమార్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎస్ఎండీ హుసేన్‌బాష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబావలి ఎన్నికయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎస్ఏ అలీమ్ బాషా, ఉపాధ్యక్షుడిగా హనుమనాయక్, ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీగా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమణరావు ఎన్నికయ్యారు. అనంతరం ఎంపికైన వారికి డిక్లరేషన్ పత్రాలు అందజేశారు.


ఎంపికైన అనంతపురం జిల్లా కార్యవర్గానికి డిక్లరేషన్ అందజేస్తున్న దృశ్యం


శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గానికి డిక్లరేషన్ అందజేస్తున్న దృశ్యం

కదలని రథం పనులు

పెన్నహోబిలంలో ఆగిపోయిన తయారీ
కలప నాణ్యతపై అధికారుల అభ్యంతరం


రథం చక్రం

ఉరవకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం తయారీ వచ్చే బ్రహోత్సవాల నాటికైనా పూర్తి అయ్యేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రథం తయారీ పనులు నాలుగు నెలలుగా ఆగిపోయాయి. రెండేళ్ల క్రితం పాత రథానికి మరమ్మతులు చేస్తున్న సందర్భంలో కూలిపోయి ధ్వంసమైంది. ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల్లో పాత రథానికే మర్మతులు చేయించి ముగించారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికల సమయంలో హడావిడిగా రథం తయారీ పనులు ప్రారంభించారు. దీనికి రూ.1.78 కోట్లు కేటాయించారు. రథం టెండర్ల సమయంలో కూడా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం పెద్ద దుమారమే లేపింది. సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వారు నాలుగు నెలలుగా పనులు చేయడం ఆపేశారు. రథం తయారీకి ఉపయోగించే సామగ్రి నాణ్యత లేదన్న అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. కొత్త రథం తయారీకి అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి టెండర్ దక్కించుకున్నాడు. దానిని ఉరవకొండకు చెందిన వారికి సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చాడు. వారు ఇప్పటికే రూ.63 లక్షల దాకా రథం తయారీకి ఖర్చు పెట్టారు. వాటికి సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడంతోనే పనులు ఆపినట్లు తెలుస్తోంది. ఇటీవల బదిలీల్లో భాగంగా కొత్తగా అధికారి రావడంతో సబ్ కాంట్రాక్టర్, అధికారి మధ్య వివాదం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండ్రోజుల క్రితం దేవదాయ శాఖకు చెందిన ఇంజనీర్ రథం తయారీ పనులు పరిశీలించారు.


రథం తయారీకి వాడుతున్న కలప

నాణ్యతలేని కలప వాడొద్దని చెప్పాం

రథం తయారీలో నాణ్యత లేని కలపను వాడద్దని సూచించాం. రథం నమూనాను తయారు చేసిన తర్వాతే పనులు చేపట్టాలి. టెండర్ సమయంలో రెండేళ్లలోపు పూర్తి చేసేలా అగ్రిమెంట్ ఉంది. పనులు ఆగిపోయిన విషయం నాకు తెలియదు. సబ్ కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లింపు అంశం నా దృష్టికి రాలేదు.

- శ్రీనివాసప్రసాద్, డీఈ, దేవదాయ శాఖ

దేవ్ ప్రమోద్ డబుల్ సెంచరీ


డబుల్ సెంచరీ చేసిన దేవ్ ప్రమోద్


5 వికెట్లు తీసిన మహిత్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): డబుల్ సెంచరీతో కదం తొక్కాడు దేవ్ ప్రమోద్. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-16 రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీలు నిర్వహించారు. ఏసీఏ-ఏ జట్టు, ఏసీఏ-బీ జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన టీం ఏ జట్టు 76.4 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌట్ అయింది. బీ జట్టు బౌలర్ మహిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన ఏసీఏ-బీ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో ఏసీఏ-సీ జట్టు, ఏసీఏ-డీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన డీ జట్టు 77ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైంది. ఇందులో దేవ్ ప్రమోద్ 217 బంతుల్లో 39 బౌండరీలతో 215 పరుగులు చేశాడు. మొదటి రోజు ఆటముగిసే సమయానికి సీ జట్టు 11 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 29 పరుగులు చేసింది.

ఆంధ్రా అండర్-15 జట్టులో ఇద్దరికి చోటు


చక్రిక


తేజశ్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 బాలికల జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన చక్రిక, తేజశ్వినికి చోటు దక్కింది. ఒడిశాలోని కటక్‌లో ఈనెల 21 నుంచి బీసీసీఐ అండర్-15 మహిళా క్రికెట్ జాతీయ స్థాయి టోర్నీకి ఆంధ్రా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. వారికి జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కట్నం వేధింపులు భరించలేక
నిప్పంటించుకుని మృతి


భవాని (ఫైల్)

కూడేరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పెళ్లయి తొమ్మిది ఏళ్లవుతున్నా అదనపు కట్నం కోసం అత్తారింటి వేధింపులు తగ్గకపోవడంతో తనువు చాలించింది ఓ మహిళ. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. కణేకల్లు మండలం తుమ్మెదుర్తి గ్రామానికి చెందిన భవానికి కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన సిద్దార్థతో తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమయింది. ఆ సమయంలో ఐదు తులాల బంగారం, యాభైవేల నగదు చెల్లించారు. పెళ్లై కొన్ని రోజుల తర్వాత భర్త సిద్దార్థ, అత్త వీరమ్మ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. వీటిని భరించలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. అత్తారింటి వేధింపులు భరించలేక తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు పార్వతి, శంకర్‌గౌడ్ బోరున విలపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.


సదస్సు పోస్టర్లను విడుదల చేస్తున్న మెడికల్ రెప్‌లు

10న రాష్ట్రస్థాయి మెడికల్ రెప్‌ల సదస్సు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10న మెడికల్ రెప్‌ల రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్ తెలిపారు. ఆదివారం హెచ్ఎల్‌సీ కాలనీలోని కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో మెడికల్ రెప్‌లు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. సరైన గుర్తింపు, వేతనాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, జీతభత్యాలు, తదితర అంశాలపై సదస్సులో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మెడికల్ రెప్స్ పెద్దఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, శ్రీరామ్, కిరణ్, సురేంద్రగుప్త పాల్గొన్నారు.

పీకల్లోతు నష్టాల్లో ఏడీసీసీ బ్యాంకు

ఐదేళ్ల వైసీపీ పాలనలో కుదేలు



శాపంగా మారిన పర్సన్ ఇన్‌చార్జులు
రాష్ట్రంలోనే చివరిస్థానం
అస్తవ్యస్తంగా నిర్వహణ
రైతులపై అధికవడ్డీ



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడీసీసీబీ) తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. మరోవైపు బ్యాంకు పాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఖాతాదారులైన అన్నదాతల్లో రోజురోజుకీ బ్యాంకుపై విశ్వాసం సన్నగిల్లుతోంది. నష్టాలను పూడ్చుకునేందుకు రైతులపై రుణాలకు అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం, పర్సన్ ఇన్‌చార్జిల నియామకం బ్యాంకు, సొసైటీల పురోగతికి అడ్డంకిగా మారింది. రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా అథమ స్థానానికి పడిపోయింది. పర్సన్ ఇన్‌చార్జిలతో పాటు బ్యాంకును నడిపించాల్సిన సీనియర్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో పురోగతి మరింత కుంటుపడుతోంది.

రైతులపై అధిక వడ్డీల భారం

సొసైటీల నుంచి రైతులకు ఇచ్చిన రుణాలపై అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నాబార్డు ఆప్కాబ్ నుంచి 3.5 శాతం వడ్డీ వసూలు చేస్తుంది. నాబార్డు నుంచి నిధులు తీసుకున్న ఆప్కాబ్ ఏడీసీసీ బ్యాంకు నుంచి 5 శాతం వడ్డీ వసూలు చేస్తుంది. ఏడీసీసీ బ్యాంకు నుంచి సొసైటీలకు 6 శాతం వడ్డీకి ఇస్తున్నారు. సొసైటీలు రైతుల నుంచి 7శాతం వడ్డీ వసూలు చేయాలి. ఇందుకు భిన్నంగా 11.5 శాతం వరకు వసూలు చేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. రైతులకు సొసైటీ అధికారులు 7 శాతం వడ్డీ అంటూనే..రికార్డుల్లో మాత్రం 11.5 శాతం వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సొసైటీ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే వడ్డీ రాయితీ రైతులకు అందక పోగా...అధిక వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతు బ్యాంకులుగా ఉన్న సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకులపై అన్నదాతలకు విశ్వాసం సన్నగిల్లుతోంది.

గడిచిన ఐదేళ్లలో కుదేలు

గడిచిన ఐదేళ్ల కాలంలో సహకార బ్యాంకులు, సహకార సొసైటీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఏడీసీసీకి, సొసైటీలకు ఎలాంటి సహకారం అందించిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోగా...నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడంతో రెగ్యులర్ పాలకవర్గాలకు ఉన్నంత బాధ్యత ఉండదని చెబుతున్నారు.

రాష్ట్రంలోనే చివరిస్థానం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో అనంతపురం చివరి స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో కృష్ణా జిల్లా నిలవగా, రెండో స్థానంలో కాకినాడ, తృతీయ స్థానంలో ఏలూరు.. చివరిస్థానంలో అనంతపురం ఉన్నాయి. ప్రథమ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా రూ.10వేల కోట్ల టర్నోవర్‌లో ఉండగా... అనంతపురం రూ.1800 కోట్లు మాత్రమే టర్నోవర్ చేస్తోంది. పక్కనే ఉన్న కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు సైతం రూ.4వేల కోట్ల టర్నోవర్‌తో ముందు వరుసలో ఉన్నారు.

భారమైన నియామకాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడీసీసీ బ్యాంకుకు సంబంధించి 28 శాఖలు ఉన్నాయి. మొత్తం 220 మంది ఉద్యోగులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం 140 మంది మాత్రమే ఉద్యోగులు ఉండేవారు. అప్పట్లో రూ.60లక్షల వరకు జీతాలకు వెచ్చించేవారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో 80 మందికి ఉద్యోగ నియమకాలు చేపట్టారు. 140 మంది ఉద్యోగులు ఉన్నప్పుడు ఎంత ఆదాయం ఉందో.. 220మంది ఉద్యోగులు ఉన్నప్పుడు కూడా అదే ఆదాయం వస్తోంది. ఉద్యోగుల వేతనాలు రూ.60లక్షల నుంచి రూ.1.10 కోట్లకు పెరిగింది. దీంతో బ్యాంకుకు ఆర్థిక భారంగా మారింది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకంతో..

బ్యాంకుతోపాటు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం పురోగతికి అడ్డంకిగా మారింది. ఎన్నికల్లో గెలిచి వచ్చిన పాలకవర్గాలకు ఉన్న బాధ్యత... తాత్కాలికంగా పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమితులైన వారికి ఉండడం లేదనేది బ్యాంకు పురోగతిని చూస్తేనే అర్థమవుతుంది. ఐదేళ్లపాటు పర్సన్ ఇన్‌చార్జిలను నామినేట్ చేయడంతోనే కాలం వెల్లబుచ్చారు. సీనియర్ అధికారుల మధ్య సమన్వయ లోపం, విధులకు చుట్టపుచూపుగా వచ్చిపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది.

నష్టాల్లో ఉన్నది నిజమే



ఏడీసీసీ బ్యాంకు పూర్తిగా నష్టాల్లో ఉన్నది నిజమే. బ్యాంకుతో పాటు సొసైటీలు పూర్తి నష్టాల్లో ఉన్నాయి. వాటిని నష్టాల్లో నుంచి గట్టెక్కించడానికి ప్రయత్నిస్తున్నాం. దీనికి చాలా సమయం పట్టేలా ఉంది. ఇప్పట్లో బ్యాంకు, సొసైటీలు కోలుకోవడం అంత సులువైన పనికాదు. అందరం కలసి నష్టాల్లో నుంచి బయట పడేసేందుకు శ్రమిస్తున్నాం. పురోగతిలో నడిపించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

- శివనారాయణశర్మ, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక


జస్వంత్, చంద్రమౌళి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి చెన్నైలో నిర్వహించే హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు ఆంధ్రా హాకీ సీనియర్ మెన్ జట్టు తరపున జిల్లాకు చెందిన క్రీడాకారులు జస్వంత్, చంద్రమౌళి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులకు హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ అభినందనలు తెలిపారు.

జీడిపల్లికి 1108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1108 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,068 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.658 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, డైట్ సిబ్బందికి లీడర్‌షిప్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకూ రెసిడెన్షియల్ ట్రైనింగ్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. బళ్లారి రహదారిలోని సీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలను వేదికగా ఎంపిక చేశారు. మొత్తం 300 మంది ట్రైనింగ్‌కు హాజరుకానుండగా అనంతపురం జిల్లా నుంచి 100 మంది, సత్యసాయి జిల్లా నుంచి 100 మంది, అన్నమయ్య జిల్లా నుంచి 100 మందిని ఎంపిక చేశారు. వీరికి ఆరు రోజులు శిక్షణ ఇస్తారు. అదే విధంగా జిల్లాలో రెండో విడత ఎఫ్ఎల్ఎన్ శిక్షణ సైతం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో నిర్వహిస్తారు. అనంతపురం జిల్లా నుంచి 125 మంది, కర్నూలు నుంచి 125 మంది ఉపాధ్యాయులు హాజరుకానున్నారు. 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 9వ తేదీ వరకూ శిక్షణ ఇస్తారు.

గంజాయి విక్రేత అరెస్టు

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షికారి కాలనీకి చెందిన గంజాయి విక్రేత షికారి అంజనీని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అంజనీ కర్ణాటక రాష్ట్రం బళ్లారి రైల్వే స్టేషన్‌లో కేజీ గంజాయిని కొనుగోలు చేసి గుంతకల్లులో విక్రయిస్తున్నాడు. సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ మనోహర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంజాయి అమ్ముతున్న షికారి అంజనీని వెంటనే అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.37వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి అతన్ని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.



యంత్రాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, రాయచోటి రోడ్డు పనులు పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కదిరి, రాయచోటి రోడ్డు పనులను డిసెంబర్‌లోపు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్ల కాలువలో రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు పనులు కావని కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈయేడాది డిసెంబరు చివరినాటికి పనులు పూర్తి చేసి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రాకపోకల కొనసాగింపు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో యేళ్లతరబడి నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పనులు ప్రారంభించామన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ, కన్వీనర్ కొండయ్య, కూటమి నాయకులు ఆనంద్, ఆక్రమ్ బాషా, టోపీసాబ్, ఉమ్మర్‌అలీ, క్రిష్ణానాయక్, ఆదిరెడ్డి, బాహుద్దీన్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే

నంబులపూలకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లిలో నెలకున్న తాగునీటి ఎద్దడిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తీర్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే సొంత ఖర్చులతో బోరు వేయగా, నీరు పుష్కలంగా పడినట్లు చెప్పారు. ఎమ్మెల్యేకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



బోరులో నీరు పడిన దృశ్యం

రిటైర్డ్ ఉద్యోగి విరాళం

కదిరి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కదిరి ఆర్టీసీ డిపో పదవీ విరమణ సంఘానికి ఆ సంస్థ రిటైర్డు ఉద్యోగి హరిమోహన్ ఆదివారం రూ.పదివేలు విరాళం అందించారు. ఈమొత్తాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి మహబూబ్‌బాషాకు అందించారు. పదవీ విరమణ ఉద్యోగులు చనిపోతే వారికుటుంబాలకు రూ.4వేలు సాయం అందించేందుకు ఈ సొమ్ము ఇచ్చినట్లు తెలిపారు. విరాళామిచ్చిన హరిమోహన్‌కు రిటైర్డు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి: సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, పాతనేరస్థులు సత్ప్రవర్తనతో నడుచుకుని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. ఆదివారం టూటౌన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. మీ ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణికావేశాలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కుని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి: ప్రతి ఒక్కరు గొడవలకు దూరంగా ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని ముస్టూరు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామస్థులతో ఎస్‌ఐ సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు గొడవలు, కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. పేకాట, మద్యం, సారా అమ్మకాలు చేసినా, ఆడినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

కదిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూల బజారులో శనివారం జరిగిన దాడి కేసులో పూలబజారుకు చెందిన బాలమురళీకృష్ణ అలియాస్ బాలుపై హత్యాయత్నం కేసు నమోదైనట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూలబజారులోని ఆకుతోట వద్ద కొండరాసి హరిప్రసాద్ ఉండగా, బాలు తోట వద్ద టపాసులు కాలుస్తున్నాడు. బాలుకు అక్కడున్న వారు పక్కకెళ్లి కాల్చాలని సూచించారు. అలా చెప్పినందుకు బాలు తనపై ఇటికపెల్లతో దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచి, తనను చంపాలని చూశారని, హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు బాలుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురం శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.14.150 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆదివారం తారకరామాపురం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అధ్యాపక వృత్తి పవిత్రమైనది

హిందూపురం అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అధ్యాపక వృత్తి చాలా పవిత్రమైనదని ఆర్యవైశ్య కుల గురువు శ్రీవాసవీ పీఠం 2వ గురువు అయిన సచ్చిదానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం హిందూపురానికి విచ్చేసిన సందర్భంగా ఆయన ఎస్‌డిజీఎస్ కళాశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం చాల గొప్పదన్నారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ అధ్యక్షుడు రేవూరి చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంపప్రసాద్, ఉపాధ్యక్షుడు దాసా సురేష్, ఉపకార్యదర్శి దాసా గంగాధర్, కోశాధికారి నందకిషోర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

భక్తిభావంతో ముందుకు సాగాలి

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ముందుకు సాగాలని అపుడే ప్రాంతం, దేశం శాంతి సౌభాగ్యాలతో ఉంటుందని సచ్చిదానంద సరస్వతీ స్వామిజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పట్టణంలోని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీమాత కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆయన ప్రసంగించారు. చిన్నతనం నుంచే భక్తి మార్గంలో పయనిస్తే మంచి ప్రయోజకులుగా తయారౌతారన్నారు. పిల్లలకు భగవంతుని లీలలు తెలియజేయాలన్నారు. అదే విధంగా మనసంస్కృతి సంప్రదాయాలు, మన సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జెపికె రాము, కార్యదర్శి శ్రీకాంత్, వందలాది మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా... ప్రాథమికోన్నత పాఠశాల..!

● పాఠశాల ఆవరణలో ఎటుచూసినా మద్యం బాటిళ్లే
● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
● పట్టించుకోని అధికారులు, గ్రామస్థులు



నారసింపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

తాడిమర్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మందుబాబులకు నారసింపల్లి ప్రాథమికోన్నత పాఠశాల అడ్డాగా మారింది. నిత్యం పాఠశాల ఆవరణలో రాత్రి 7 గంటలు దాటితే మందు బాబులు హల్ చేస్తున్నారు. పాఠశాల అంటే ఒక దేవాలయంలా భావించి అందులో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా గ్రామస్థులు చూసుకుంటారు. కానీ నారసింపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రాత్రైతే చాలు మందు బాబులు చేరి అక్కడే మద్యం సేవించి వాటర్‌ప్యాకెట్లు, మందు బాటిళ్లు ఆవరణంలో పారేస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులకు తాగునీరు అందించే కుళాయిలను విరగకొడుతున్నారు. పాఠశాలలో 76 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి తాగునీరు సరఫరా చేసేందుకు సత్యసాయి నీటి సరఫరా వారు కొళాయిలు ఏర్పాటు చేశారు. మందుబాటులు నిత్యం వాటిని విరగ్గొడుతున్నారు. పాఠశాల ఆవరణలోనే మద్యం సేవించి బాటిళ్ల గొడకేసి కొడుతుండటంతో గాజుపెంకులు ఆటస్థలంలో పడుతున్నాయి. వీటి మూలంగా ప్రతి రోజు ఉదయం పాఠశాలకు వస్తూనే గాజుపెంకులు ఎక్కడ ఉన్నాయోనని వెతికి మరీ పారవేయాల్సి వస్తోందిన విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు విశాలమైన మైదానంతో పాటు ప్రహరీ, దానికి గేటును ఏర్పాటు చేశారు. గేటుకు తాళాలు వేసినా పగలకొట్టి మరీ లోపలికి వెళ్తుండటంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై గ్రామస్థులు సమష్టిగా చర్యలు చేపడితే తప్పా సమస్య పరిష్కారం కాదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఎలాగైనా పాఠశాల ఆవరణం శుభ్రంగా ఉంచాలని గ్రామస్థులు పాటుపడాలని మద్యంబాబులు పాఠశాల వైపు రాకుండా చూడాలని ఉపాధ్యాయుడు ఆదినారాయణ కోరారు.



పాఠశాల ఆవరణలో పడిన మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు

12వ పీఆర్‌సీని ప్రకటించాలి: యూటీఎఫ్

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ధర్మవరంఅర్బన్, రూరల్ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల కమిటీల ఎన్నికల అధికారి రామకృష్ణనాయక్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించగా, పరిశీలకులుగా మల్లేశు, పెద్దకోట్ల సురేశ్ వ్యవహరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదునెలలు అవుతున్నా ఇంతవరకు 12వ పీఆర్‌సీ ప్రకటించలేదన్నారు. ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, కేవలం రూ.350 కోట్లు చెల్లించారన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కమిటీల ఎంపిక: ధర్మవరం పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా జింకా హరికృష్ణ, పోసా సాయిగణేశ్, రూరల్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఆంజనేయులు, జనార్దన్‌బాబు ఎన్నికయ్యారు. పట్టణ గౌరవాధ్యక్షులుగా రామకృష్ణనాయక్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, లతాదేవి, కోశాధికారి రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్‌లుగా మేరి వరకుమారి, మణిమాల, లక్ష్మయ్యరాంప్రసాద్, రూరల్ గౌరవాధ్యక్షులుగా పూజారి విజయ భాస్కర్, ఉపాధ్యక్షులుగా తులసీ, ఎం.వి వెంకటకిశోర్, కోశాధికారి అమర్ నారాయణరెడ్డి ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

బుక్కపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల బెదిరింపులో ఆత్మహత్యకు ప్రయత్నించిన గౌతమ్‌ను, కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. సంఘటనకు సంబంధించిన వైసీపీ కార్యకర్తలపై వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించారు. దాడి సంఘటనపై విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీ రత్నాను కోరారు. శాంతిభద్రల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి, బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నల్లమాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెడ్డిపల్లి వైద్యులు గణేనాయక్, సీహెచ్ఓ రామాంజునేయులు సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అలాగే దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించాలన్నారు. సాయంత్రం సమయంలో వేపాకు పొగ ఇళ్లలో వేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీటితొట్టెలను శుభ్రం చేసుకోవాలన్నారు. అలా చేస్తే దోమల లార్వాలు నశిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

నల్లమాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు శరవేగంగా సాగుతోంది. వారం నుంచి 1,150 సభ్యత్వాలు చేయించినట్లు కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసిన ప్రతి ఒకరికి ఏదైనా ప్రమాదంలో మృత్యువాత పడితే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని, అలాగే మట్టి ఖర్చులకు పార్టీ రూ.10 వేలు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వనమోదు చేయించుకోవలన్నారు.

కదిరి: పట్టణంలోని 6వ వార్డులో ఆదివారంలో టీడీపీ సభ్యత్వనమోదుచేపట్టారు. ప్రతి కార్యకర్త రూ.100 చెల్లించి సభ్యత్వం పొందింతే కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీతోనే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీ నాయకులు పర్వీన్‌భాను, చైతన్య, శేష, మాబూ, కేశవ్, బండలనాయుడు పాల్గొన్నారు.

బేస్‌బాల్, స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల, బండ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్, స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బేస్‌బాల్‌లో కీర్తన, నవ్య, పరుశురాం జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైటన్లు తలమర్ల పాఠశాల హెచ్ఎం తెలిపారు. బండ్లపల్లి పాఠశాలకు చెందిన హన్సిక, కావ్య, పల్లవి, బాలాజీ, ఫణి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు గుంటూరు జిల్లాలోని నరసరావుపేటలో 6వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

ఘనంగా కొద్దేవర మహోత్సవం



ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలోకి వస్తున్న మహిళలు

తనకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డుమరవపల్లి, పెద్దపల్లి, చిన్నపల్లి, దండువారిపల్లి గ్రామాల్లో మోరుసుకాపు కులస్తులు ఆదివారం కొద్దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలు బోరు, బావుల వద్దకెళ్లి గంగమ్మకు పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల ఆకులు, గింజలతో తయారు చేసిన పదార్థాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇలా నిర్వహించడం వల్ల మోరుసుకాపు సంస్కృతి సంప్రదాయలను కాపాడడమేకాకుండా యేడాది పొడవునా వ్యవసాయం, పశు పోషణకు ఇబ్బందులు ఉండవన్నది గ్రామస్తుల విశ్వాసం.

6న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారామవ ఆధ్వర్యంలో 6వ తేదీన పోలీసు, పాత్రికేయులకు ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన క్రికెట్ క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7337714755 నంబరును సంప్రదించాలన్నారు.

బహుజన ఉద్యోగులు ఏకంకావాలి

● ఏపీ విద్యుత్ బహుజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బహుజన ఉద్యోగులందరూ ఏకం కావాలని ఏపీ విద్యుత్ బహుజన ఉద్యోగుల సంఘం, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం విద్యుత్ శాఖ ఏపీఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రవిశంకర్ అధ్యక్షతన ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య హాజరై మాట్లాడారు. జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్ మార్గంలో సమస్యలపై పోరాటా నికి సిద్ధం కావాలన్నారు. అనం తరం జిల్లా విద్యుత్ బహుజన ఉద్యోగుల అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడిగా మహేశ్వరరావు, కా ర్యదర్శిగా శ్రీధర్‌ను ఎన్నుకొన్నారు. అదేవిధంగా యూనియన్ రీజినల్ అధ్యక్షుడిగా సమీవుల్లా, కార్యదర్శి గా మస్తాన్‌వలిని ఎన్నుకొన్నారు. ఈకార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ రాజశేఖర్, డీఈఈ వివేకనందస్వామి, ఏఈఈ హమీ దుల్లా బేగ్, సబ్ ఇంజనీర్లు పి రోజ్, శంకర్ నారాయణ, కార్మి కుల సంఘం నాయకులు నాగా ర్జున తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు కూలుతాయో?

● శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు
● భయం గుప్పిట్లో సిబ్బంది విధులు
● పట్టించుకోని ఉన్నతాధికారులు



శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ ఏఈ కార్యాలయ భవనం

ఓబుళదేవరచెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో గత్యంతరం అక్కడే విధులు కొనసాగించాల్సి వస్తోందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం పైకప్పులో కడ్డీలు దర్శనమిస్తున్నాయి. కార్యాలయం పైభాగం పెచ్చులుండడంతో కడ్డీలు దర్శనమిస్తున్నాయని, ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం చుట్టూ సన్‌సైడ్ దెబ్బతినడంతోపాటు, వర్షాకాలంలో కార్యాలయం గదులుకూడా కారుతున్నాయి. ఈ కార్యాలయం సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకుంది. అలాగే సచివాలయ 1, 2, పాత ఎస్సీ హాస్టల్ భవనంలో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. సచివాలయాలు కూడా దెబ్బతినడంతోపాటు పైపెచ్చులు ఊడిపోవడంతో వర్షాకాలంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయం నిర్మాణం కూడా ఆగిపోవడంతో విధిలేని పరిస్థితిల్లో పాత ఎస్సీ హాస్టల్‌లోనే విధులు కొనసాగిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే దెబ్బతిన్న కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని, లేదా మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు, అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో గ్రామ సచివాలయం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పట్నం పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2002-03లో పది చదివిన విద్యార్థులు ఒక్కచోట చేరారు. 20యేళ్ల తరువాత కలిసిన విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను పూలమాలలు, దుశ్శాలవలతో సన్మానించారు. అనంతరం ఒకరికొక్కరు క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పోలిరెడ్డి, మధురాంబ, మౌలాఖాన్, శ్రీరాములనాయక్, రమణ, విశ్వనాథ్‌రెడ్డి, నాగభూషణం, వై. రామాంజులు, రంగారెడ్డి, శివాతోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బత్తలపల్లి: స్థానిక జక్కంపూటి వెంకటేసు బాలుర ఉన్నత పాఠశాలలో 1990 నుంచి 1994 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం గూండా కళ్యాణ మండపంలో సమావేశం అయ్యారు. వారు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం విద్యనేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. మండలంలోని నల్లబోయనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠాశాలలో 2021-22 చదివిన పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరారు. గురువులను సన్మానించి తోటి విద్యార్థిని అంజనీదేవి ఆస్పత్రిలో చికిత్సపొందుతోందని తెలుసుకున పూర్వ విద్యార్థులు రూ.లక్ష ఆర్థికసాయం అందించారు.



15 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు: మండలంలోని మిట్టపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 యేడాది పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. పాఠశాలలో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి ఎలా సాయం చేయాలన్న వాటిపై చర్చించారు. త్వరలో అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, భవిష్యత్ ప్రణాళికలను రూపొందించారు. పూర్వ విద్యార్థులు నరేష్, సురేష్‌బాబు, నీలకంఠ, చంద్రశేఖర్, విఠల్ ప్రసాద్, శకుంతల, వనజాక్షి, తాసీనాసుల్తాన్, గాజుకుంటపల్లి మణి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు సన్మానం



టీడీపీ కార్యకర్తలు, నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టుపల్లి, ఒడ్డుకిందతండా, మద్దన్నగారిపల్లి గ్రామాలలో టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. సభ్యత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పార్టీ గెలుపుకోసం కృషిచేసిన 20 మంది నాయకులు,కార్యకర్తలను మద్దన్నగారిపల్లిలో చినగాని కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సత్కరించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మలమనోహర్, చినగాని నరసింహయాదవ్, చలపతి, మోహన్ పాల్గొన్నారు.

16న మాదిగల ఆత్మీయ సదస్సు



సమావేశంలో పాల్గొన్న మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు

కదిరి అర్బన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 16న నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని మాదిగల ఉద్యోగ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గునివాండ్ల నాగేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు.

దేశంలో ఏ పార్టీకీలేని క్యాడర్ టీడీపీ సొంతం

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలర్ ఎత్తుకుని తిరిగే సత్తా ఒక్క తెలుగుదేశం కార్యకర్తకే ఉందని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిందని దేశంలో ఏ పార్టీకీ లేని క్యాడర్ టీడీపీకే ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రజల బడుగు బలహీనవర్గాల కష్టనష్టాలు తెలుసని వారికి అనువైన సంక్షేమపథకాలు ఏర్పాటు చేశారని ఆమె అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహులు, కన్వీనర్ శ్రీరాములు, నాయకులు మాధవనాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లి ఎంజెపి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంత్రి సవిత విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రొద్దం మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజకు హాజరైన మంత్రి పాఠశాలను సందర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేష్(36) ఆదివారం వంకలోపడి మృతిచెందిన సంఘటన తెలుసుకున్న మంత్రి సవత ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చంద్రమౌళేశ్వరస్వామికి నక్షత్ర పూజ



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి

మడకశిరటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పావగడ రోడ్డులో వెలిసిన చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నక్షత్ర పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 4వతేదీన మొదటి కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15వతేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కోటి దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. సోమవారం నుండి తైలాభిషేకం చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కావున భక్తులు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

శివాలయాల్లో కార్తీకమాస పూజలు

మడకశిర రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని అన్నీ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో వెలసిన గంగాధరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక అలంకణచేసి పూజలు నిర్వహిచారు ఆ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు.

రిటైర్డ్ న్యాయమూర్తి భార్య వైకుంఠ సమారాధన



సిద్దగంగమ్మకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి శివలింగేగౌడ్ సతీమణి సిద్ధగంగమ్మ వైకుంఠ సమారాధన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పాల్గొని సిద్దగంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆది కవి, రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను పావగడ పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం 10 గంటలకు వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణం ముందు వాల్మీకి చిత్రపటాన్ని అలంకరించిన రథోత్సవానికి నిడిగల్ వాల్మీకి మఠాదీశ్వరుడు సంజయ్ కుమార్‌స్వామిజీ పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కుమారస్వామి లేఔట్‌లోని వాల్మీకి ఆలయానికి ఊరేగింపుగా వెళుతూ అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తూ మహిళలు జ్యోతులు మోస్తూ అంబేడ్కర్ సర్కిల్ వరకు తరలివెళ్లారు. వాల్మీకి రామచరిత్రను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని సంజయ్‌కుమార్ స్వామిజీ తెలియజేశారు. ఈసందర్భంగా అనేక మంది వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

కెంపేగౌడ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కుంచిటిగ వక్కలిగలు

అమరాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందుభాగంలో మడకశిర హేమావతి కూడలి రోడ్డులలో కెంపేగౌడ విగ్రహ ప్రతిష్ఠాపన భూమిపూజలో కుంచిటిగ వక్కలిగలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కెంపేగౌడ విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం అడిగిన వెంటనే మన ప్రియతమనేత ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు అడిగిన వెంటనే కాదనకుండా అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేకంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలకు కుంచిటిగ వక్కలిగుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కుంచిటిగ వక్కలీగులు మండల కన్వీనర్ గణేష్, మాజీ సర్పంచి విశ్వేశ్వర, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు ఎస్.ఆర్.హనుమంతరాయప్ప, డాక్టర్ నళిని రంగేగౌడ్, రొళ్ల జడ్పీటీసీ అనంతరాజు, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, హలుకూరు కాంతరాజు, వీఎం పాండురంగప్ప, నాగోనపల్లి మంజునాథ్, గురుసిద్దప్ప, బంగారుపాళ్యం తిప్పేస్వామి, హలుకూరు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఉగ్రప్ప, మరియు కుంచిటిగ వక్కలిగలు, మహిళలు, పెద్దఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు నీటి ట్యాంకు వేలం

లేపాక్షి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనే ఈ ట్యాంకు ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు శిథిలావస్థలో ఉన్న రాతి నీటి ట్యాంకుకు సోమవారం ఉదయం 11గంటలకు పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొనవచ్చని కార్యదర్శి రమేష్ తెలిపారు.

నట్టింట్లోనే బాంబులు

మిగిలిన టపాసులపై సర్వత్రా సందేహాలు



విక్రయించగా మిగిలిపోయిన టపాసులు

● అమ్ముడుపోయింది 80శాతమే ● మిగిలినవన్నీ ఇళ్లకే తరలింపు ● తనిఖీలు మరిచిన అధికారులు

హిందూపురం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది దీపావళి పండగ సందర్భంగా రెండురోజులపాటు బాణసంచా మోతతో చెవులు బిర్రుమనిపించారు. గతంతో పోల్చితే ఈసారి అనుకున్న స్థాయిలోనే టపాసులు అమ్ముడుపోయాయి. కానీ పండగ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో కొన్నింటిలో 20నుంచి 40శాతం వరకు టపాసులు మిగిలాయి. తాత్కాలిక దుకాణదారులు ఎంత సరుకు తీసుకొస్తున్నారు, ఎంత మిగులుతుంది, మిగిలిన సరుకును ఎక్కడ దాచుతున్నారనే అంశంపై అధికారులు నిఘా వేయకుండా వదిలేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎప్పటిలాగే ఈసారికూడా దుకాణదారులు టపాసులు తమ ఇళ్లలో నిలువ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఇళ్లమధ్య టపాసులు నిలువ ఉంటే ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దుకాణం ఏర్పాటు నుంచి పండగ ముగిసినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అమ్ముడుపోయింది 80 శాతమే..

జిల్లా వ్యాప్తంగా 150వరకు చిన్నా పెద్దవి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. హిందూపురంలో కూడా 56మంది తాత్కాలిక దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా 30మంది షాపులు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కోసారి హిందూపురంలో ఏర్పాటు చేసుకున్న షాపు యజమానులు ఒక్కో షాపుకు రూ.5లక్షల నుంచి 20లక్షల వరకు సరుకు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి దుకాణాలకు అనుమతి వచ్చిన తరువాతే సరుకు తీసుకురావాలి. కానీ హిందూపురంతోపాటు జిల్లాలో పండగకు నెల ముందుగానే అక్రమంగా టపాసులు నిలువ చేసుకున్నారు. అంతేకాక జిల్లాకు వచ్చిన టపాసులు ఎన్ని అనేది వాణిజ్యశాఖ వద్ద లెక్కలు లేవు. దీంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

తనిఖీలు మరిచారు

జిల్లాలో తాత్కాలిక టపాసుల దుకాణదారులంతా కలిసి సుమారు రూ.10కోట్ల విలువచేసే టపాసులు తీసుకొచ్చినట్లు అంచనా. హిందూపురంలోనే రూ.3కోట్ల నుంచి రూ.5కోట్ల దాకా సరుకు తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. ఇక మిగిలిన పట్టణాల్లో విక్రయాలకు తీసుకొచ్చిన బాణసంచా విలువ కూడా మరో రూ.5 కోట్లు ఉంటుంది. అమ్మకాలు కొన్నిచోట్ల 60శాతం నుంచి 80శాతం వరకు జరిగాయి. ప్రతియేటా 40నుంచి 50శాతం సరుకు మిగులుతుండగా ఈసారి 20నుంచి 40శాతం సరుకు మిగిలినట్లు అంచనా. అయితే ఈసారి ఎంత సరుకు వచ్చిందనేది వాణిజ్యపన్నులశాఖ వద్ద లెక్కలులేవు. దుకాణాల ఏర్పాటు చేసిన తరువాత కనీసం తనిఖీలు కూడా చేయలేదు. దీనిని బట్టి ఆశాఖలో తాత్కాలిక దుకాణదారులు ఎంతగా సర్దుబాటు చేశారో అర్థం అవుతుంది. మిగిలిన టపాసులు ఎక్కడ నిలువ చేయాలన్నది నిబంధనలు ఉన్నాయి. జనసంచారం లేని ప్రాంతంలో గోదాముల్లో నిలువ చేయాలి. అక్కడ కూడా నిబంధనలు ఉంటాయి, అవిపాటిస్తేనే సరుకు నిలువ ఉంచుకునేందుకు అవకాశం ఉంటుంది.

గోదాములెక్కడ?

ఇదిలా ఉంటే జిల్లాలో ప్రధాన పట్టణాల్లో ఏడాది పొడవునా టపాసులు అందుబాటులో ఉంటాయి. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టపాసులు నిలువ చేసుకోవాలంటే జనసంచారానికి దూరంగా గోదాములు ఉండాలి. అక్కడ రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఇచ్చిన సూచన మేరకే నిలువ చేయాలి. కానీ జిల్లా వ్యాప్తంగా టపాసులు నిలువ చేసుకోవడానికి ఐదుగురికి కూడా అనుమతిలేదని లెక్కలు చెబుతున్నాయి. హిందూపురంలో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంది. కానీ ఇక్కడ 30మంది దుకాణాలు పెట్టగా వీరందరికి నిలువ చేసుకోవడానికి అనుమతి లేదు. అలాంటప్పుడు వీరంతా మిగిలిన సరుకు ఇళ్లలోనే పెట్టుకుంటున్నారు. దీనివల్ల ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చు. దీపావళికి తాత్కాలిక దుకాణదారులు విక్రయించగా మిగిలిపోయిన సరుకును ఇళ్లమధ్యనే నిలువ చేసుకుని పెళ్లిళ్ల ఇతర ర్యాలీలకు విక్రయాలు చేస్తుంటారు. అయినా వారు కళ్లుమూసుకుని వారికేమీ తెలియనట్లు ముందుకెళ్తున్నారు. దీనివల్ల జరగరాని ప్రమాదం జరిగితే ఇందుకు బాధ్యులు ఎవరన్నది అధికారులు చెప్పాలి.

ప్రమాదం అంచున ప్రయాణం



బూదిలి వద్ద దెబ్బతిన్న చిత్రావతి వంతెనపై వెళ్తున్న వాహనం

గోరంట్ల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి వద్ద గల చిత్రావతి వంతెన ప్రమాదకరంగా మారింది. నిత్యం భారీ వాహనాలు వెళ్లడానికి ఉపయోగపడే ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెన్నై తదితర పట్టణాలనుంచి కియా పరిశ్రమ, అనుబంధ కంపెనీలకు అవసరమైన ముడిసరుకుతోపాటు, కడపజిల్లానుంచి బెంగుళూరుకు వెళ్లే సిమెంటు లారీలు ఈ దోవనే తరలి వెళ్తుంటాయి. కంటైనర్లు, ట్యాంకర్లు, భారీ వాహనాలు గోరంట్ల పట్టణం గుండా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి పోలీసులు గతంలోనే వాటిని దారి మళ్లించారు. ప్రస్తుతం వాహనాలు కదిరి రహదారినుంచి రెడ్డిచెరువుకట్ట, పులేరు, బూదిలి చిత్రావతి వంతెన మీదుగా వెళ్తున్నాయి. కరోనా సమయంలో భారీ వర్షాలకు చిత్రావతి ఉధృతికి బూదిలి వంతెన కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. రాకపోకలు స్తంభించడంతో స్థానిక పంచాయతీ సిమెంటు పైపులు, మట్టి వేసి, ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మరోసారి వంతెన తెగడంతో మట్టివేసి పునరుద్ధరించారు. వైసీపీ పాలనలో పీఎంజీఎస్‌వై ద్వారా వంతెన నిర్మాణానికి రూ.8.52 కోట్లు మంజూరైనట్లు నాయకులు ప్రకటించారు. దీంతో పంచాయతీ పరిధిలోని బూదిలితండా, గొల్లపల్లి, చిన్ననారప్పపల్లి, కాగానిపల్లి గ్రామాల ప్రజలు ఎంతో సంతోషించారు. కాని వంతెన ఊసెత్తే వారు లేకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఉండగా ఇటీవల వర్షానికి వంతెన కొంత దెబ్బతినగా రాకపోకలకు ఇబ్బంది కలగడంతో గుర్తించి సిఐ శేఖర్ మట్టి తోలించి, మరమ్మతులు చేయించారు. కర్ణాటకలోని పరగోడుడ్యామ్ కొన్నిరోజుల క్రితం నిండింది. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే చిత్రావతి నది మరింత ఉధృతంగా ప్రవహించే ప్రమాదముంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బూదిలి వంతెనపై దృష్టి సారించి, వంతెన పనులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు

దేశంలో ఏ పార్టీకీలేని క్యాడర్ టీడీపీ సొంతం

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలర్ ఎత్తుకుని తిరిగే సత్తా ఒక్క తెలుగుదేశం కార్యకర్తకే ఉందని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిందని దేశంలో ఏ పార్టీకి లేని క్యాడర్ టీడీపీకే ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రజల బడుగు బలహీనవర్గాల కష్టనష్టాలు తెలుసని వారికి అనువైన సంక్షేమపథకాలు ఏర్పాటు చేశారని ఆమె అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహులు, కన్వీనర్ శ్రీరాములు, నాయకులు మాధవ నాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లి ఎంజెపి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంత్రి సవిత విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రొద్దం మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజకు హాజరైన మంత్రి పాఠశాలను సందర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేష్(36) ఆదివారం వంకలోపడి మృతిచెందిన సంఘటన తెలుసుకున్న మంత్రి సవత ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

యూటీఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టర్లను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్‌ల ఆధ్వర్యంలో మంత్రి సవిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూటిఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 10న ఆదివారం కదిరి జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో స్వర్ణోత్సవ జిల్లాస్థాయి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బూతప్ప, నారాయణస్వామి, రమేష్, రవీంద్ర, ఉపేంద్ర, దినేష్ పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న సీపీఐ నాయకులు



మట్టి తరలింపును అడ్డుకుంటున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు సమీపంలో పెద్దకొండ వద్ద జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలించడాన్ని ఆదివారం సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి మాట్లాడుతూ అక్రమ మట్టి దందా మండలంలో జోరుగా సాగుతున్నదన్నారు. సెలవుదినాల్లో అధికార పార్టీ నాయకులు జేసీబీ ద్వారా వందలాది ట్రాక్టర్ల మట్టిని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ట్రాక్టర్‌కు రూ.700 చొప్పున వాణిజ్య వ్యాపార సముదాయాలకు, లేఅవుట్లకు సరఫరా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. గతంలోసైతం అక్కమ్మగార్ల కొండ సమీపంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారన్నారు. దీనిపై అనేకమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కొండలను పిండి అక్రమార్జనకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ పార్టీ తరుపున పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



రోడ్డుపైనే పంట నూర్పిళ్లు..

హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి చిలమత్తూరుకు వెళ్లే జాతీయరహదారిలో గ్రామాలవద్ద రోడ్డుపై మొక్కజొన్నల కుప్పలు కనిపిస్తాయి. ఎదురుగా వాహనం వస్తే గుర్తించడానికి వీలుండదు. ఈ క్రమంలో వేగంగా వెళ్తే ప్రమాదం జరగకమానదు. గతంలో ఇదే రహదారిలో మొక్కజొన్న ఆరబోసినప్పుడు రాత్రి,పగటి పూట కూడా ప్రమాదాలు జరిగి కొందరి ప్రాణాలు సైతం పోయాయి. ఈసారి చాలాచోట్ల రోడ్లపైనే పంటలు నూర్పిడి చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై పంటనూర్పిడికి చెక్‌పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు వినతి

మడకశిరటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రెవిన్యూ శాఖ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం సత్యసాయి జిల్లాకు వస్తున్న సందర్భంగా ఆయన దృష్టికి మడకశిర రెవిన్యూ డివిజన్ ఏర్పాటు విషయాన్ని తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొట్టమొదటి సారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లా సరిహద్దుప్రాంతమైన కొడికొండ చెక్‌పోస్టు వద్దకు మడకశిర నియోజకవర్గం నుండి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లి ఘన స్వాగతం పలకాలన్నారు. ఈసందర్భంగా మడకశిర రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై వినతిపత్రం అందివ్వడంతోపాటు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు కొడికొండ చెక్‌పోస్టు వద్దకు అందరూ చేరుకోవాలని సూచించారు.

అధ్యాపక వృత్తి పవిత్రమైనది



ప్రసాదం అందిస్తున్న స్వామీజీ

హిందూపురం అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అధ్యాపక వృత్తి చాలా పవిత్రమైనదని ఆర్యవైశ్య కుల గురువు శ్రీవాసవీ పీఠం 2వ గురువు అయిన సచ్చిదానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం హిందూపురానికి విచ్చేసిన సందర్భంగా ఆయన ఎస్‌డీజీఎస్ కళాశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం చాల గొప్పదన్నారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ అధ్యక్షుడు రేవూరి చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు దాసా సురేష్, ఉపకార్యదర్శి దాసా గంగాధర్, కోశాధికారి నందకిషోర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

భక్తిభావంతో ముందుకు సాగాలి

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ముందుకు సాగాలని అపుడే ప్రాంతం, దేశం శాంతి సౌభాగ్యాలతో ఉంటుందని సచ్చిదానంద సరస్వతీ స్వామిజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పట్టణంలోని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీమాత కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆయన ప్రసంగించారు. చిన్నతనం నుంచే భక్తి మార్గంలో పయనిస్తే మంచి ప్రయోజకులుగా తయారౌతారన్నారు. పిల్లలకు భగవంతుని లీలలు తెలియజేయాలన్నారు. అదే విధంగా మనసంస్కృతి సంప్రదాయాలు, మన సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జెపికె రాము, కార్యదర్శి శ్రీకాంత్, వందలాది మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

16న అనంతలో మందకృష్ణ మాదిగ పర్యటన

మడకశిర రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 న మందకృష్ణ మాదిగ అనంతపురానికి రానున్న సందర్భంగా ఆయన పర్యటను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఉగ్రనరసింహులు కోరారు. ఆదివారం మండలంలోని హ రేసముద్రం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించిన తరువాత మొదటిసారిగా అనంతరంపురం మందకృష్ణ మాదిగ రానున్నారన్నారు. కావున మాదిగ కులస్థులు అందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి గౌడనహళ్ళి పాఠశాల విద్యార్థినులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

మడకశిర రూరల్, నవంబరు1 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని గౌడనహళ్ళి ఉన్న పాఠశాలవిద్యార్థులు లావణ్య, దీక్షలు బేస్‌బాల్ క్రీడాపోటీలో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు పీడీ అరుణ తెలిపారు. ఆదివారం అనంతపులో జిల్లా స్థాయి బేస్‌బాలు క్రీడలు నిర్వహించారు. లావణ్య, దీక్షలు క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి క్రీడలకు ఎంపికైట్లు తెలిపారు దీంతో పాఠశాల ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

హేమావతి సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

అమరాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి వెండి కవచం ధరింపజేసి మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అదేవిధంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలోనికాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు శివకుమార్, సిద్దలింగేశ్వర, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్‌లు తెలిపారు.

వివాహిత పట్ల అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

గోరంట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన నరసింహమూర్తి ఓ వివాహితపై అసభ్యంగా ప్రవర్తించడంతో ఆదివారం అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వానవోలుకు చెందిన నరసింహమూర్తి అదే గ్రామానికి చెందిన 33 యేళ్ల వివాహిత గత నెల 22వతేదీ రాత్రిమూత్ర విసర్జనకోసం ఇంటి బయటకు వచ్చిన సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దిష్టిబొమ్మలా ఉచిత అంబులెన్స్

హిందూపురం అర్బన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి దాతల సహకారంతో ఉచిత అంబులెన్స్‌ను అందించారు. ఈ అంబులెన్స్ అందించి దాదాపు రెండు నెలలు పూర్తి అయినప్పటికి దానిని ప్రభుత్వ ఆవరణలోనే దిష్టిబొమ్మలా ఉంచేశారు. ఉచిత సేవలకు నోచుకోక దీన స్థితిలో కనిపిస్తోంది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో దాత వెంకటస్వామి దీనిని ఆసుపత్రికి అందించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు అనుకూలంగా ఉంటుందని ఈ అంబులెన్స్‌ను అందించారు. బయట అంబులెన్స్‌లకు వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో రోగులకు అనుకూలంగా ఉండాలనే మంచి ఆలోచనతో ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే అందుకు డ్రైవర్ సమస్యతోనో, మరి ఇతర కారణాలు ఏమైఉంటాయో తెలియదు కానీ అంబులెన్స్ ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి దిష్టిబొమ్మలా నిరుపయోగంగా ఆసుపత్రికే పరిమితమైంది. దీంతో రోగులు ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. ఉచిత అంబులెన్స్ ఉండి కూడా ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులోకి రాక నిరుపయోగంగా ఉండిపోయింది. ఇప్పటికైనా దీనిని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని రోగులు కోరుతున్నారు.



ఆసుపత్రికే పరిమితమైన ఉచిత అంబులెన్స్